క్లుప్తంగా

చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో గల డంపింగ్‌యార్డ్ పరిస్థితి అధ్వానం మారిందని ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డంపింగ్ యార్డ్ నుంచి రోడ్డుపై వస్తున్న చెత్తను జేసీబీ సహాయంతో తొలగించారు. అలాగే డంపింగ్‌యార్డ్ లోపల సైతం చెత్త తొలగించి శుభ్రంగా చేశారు.

అయ్యప్ప మాసపూజోత్సవం



బాల్కొండ: బాల్కొండ అయ్యప్ప ఆలయంలో ఆదివారం ఆలయ మాసపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వినాయకుడి పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పా 18 మెట్ల పూజను నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మినీవాటర్ ట్యాంకు ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్‌లోని భూదేవి ఇండోర్ స్టేడియం ఆవరణలో మినీ వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం స్థానికుడు కల్లు స్వామీ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.15 వేలు విరాళంగా అందించారు. దీంతో స్టేడియం నిర్వాహకులు, దాతతో కలిసి ఈవాటర్ ట్యాంకును ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, కార్తిక్, రాములు, గంగారాజు, ముస్కు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం



బోధన్‌టౌన్ (బోధన్): సీనియర్ సిటిజన్ డే ను ఆదివారం సీఎస్ఐ చర్చి లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వృద్ధులను సన్మానించారు.కార్యక్రమంలో పాస్టర్ ప్రభాకర్, శ్రీనివాస్, జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, కిషోర్ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో..

లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో వృద్ధులను ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు అశోక్ మధుకర్, సాయిబాబ తదితరులున్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టుపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రుద్రూర్: మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు సంఘ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కొనుగోలు కేంద్రం ప్రారంభమవుతున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్ నాగారం: నగరంలోని విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గీతభవన్‌లో జరిగింది. ధర్మపీఠ రాష్ట్ర సంచాలకులు డా.సాములపల్లి చిరంజీవాచార్యులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సాంస్కతిని సంప్రదాయాలను సనాతన వైభవాన్ని యువతకు అందించడం ముఖ్యమన్నారు. ఆత్మీయ సమ్మేళనం ఉత్తేజం చూస్తుంటే ఇందూరు జిల్లా ధర్మపీఠ నిర్దేశించుకున్న లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి విశ్వరోజు లక్ష్మణాచారి, వేవా జిల్లా అధ్యక్షులు రాఘవపురం గోపాలకృష్ణ, తదితరులున్నారు.

డబుల్ ఇళ్ల పంపిణీ ఎప్పుడో..?

- బాల్కొండ మండల కేంద్రంలో 70 ఇళ్ల నిర్మాణం పూర్తి
- అర్హులకు ఇవ్వాలని రోడ్డెక్కినా పట్టించుకోని అధికారులు



బాల్కొండలో పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్ రూం ఇళ్లు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడు అంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ముందుగా 100 ఇళ్ల నిర్మాణం కోసం 2017లో శంకు స్థాపన చేశారు. వాటిని గత సాధరణ ఎన్నికలకు మందు పంపిణీ చేశారు. మరో 70 ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారు. నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు 70 ఇళ్లు పంపిణీ చేయక పోవడంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అర్హులకు వెంటనే డబుల్ ఇళ్లు ఇవ్వాలంటూ నెలన్నర రోజుల క్రితం లబ్ధిదారులు ఇళ్లలోకి చొచ్చుకుపోయారు. పోలీసులు, అధికారులు అడ్డు చెప్పడంతో వెనుదిరిగారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. 100 ఇళ్ల పంపిణీలో అనేక అవకతవకలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. అవి పంపిణీ చేసి రెండేళ్లు పూర్తయింది. నిర్మాణం పూర్తయిన 70 ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారు. నిరుపయోగంగా ఉండటంతో అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. డబుల్ ఇళ్ల కోసం 470 మంది దరఖాస్తులు వచ్చాయి. లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. మిగతా వాటిని పంపిణీ చేయ లేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి డబుల్ ఇళ్లను పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వెంటనే పంపిణీ చేయాలి



డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి. అసలు ఎందుకు పంపిణీ చేస్తాలేరో కూడా చెప్పడం లేదు. కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారు. ఇళ్లు లేక అనేక మంది అద్దె ఇళ్లలో ఉంటున్నారు. అర్హులకు వెంటనే అందించి ఆదుకోవాలి. – శ్రీనివాస్, బాల్కొండ

బాబోయ్ కుక్కలు..

- రుద్రూర్‌లో స్వైరవిహారం
- జంకుతున్న ప్రజలు



రుద్రూర్ బస్టాండ్ వద్ద నిద్రిస్తున్న కుక్కలు



రుద్రూర్ శ్రీరాజరాజేశ్వర ఆలయ ఆవరణలో ..

రుద్రూర్: మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద అధికమైంది. గుంపుగుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. మనుషులతోపాటు మూగ జీవాలపై దాడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తున్నాయి. తెల్లవారుజామున బస్టాండ్ ప్రాంతానికి రావాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. బస్టాండ్, గాంధీచౌక్, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. మండల కేంద్రంలో జనవరి నుంచి ఇప్పటి వరకు 85 మందికి కుక్కలు కరవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. దీంతో మండల కేంద్రంలో కుక్కల బెడద ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కుక్కల బారినపడిన వారిలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు అధికంగా ఉన్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండల కేంద్రంలో కుక్కల బెడద పరిష్కారానికి అవసరమగు చర్యలు తీసుకుంటాం. సంబంధిత అధికారులకు సమస్యను వివరించి పరిష్కరిస్తాం. – ప్రేమ్‌దాస్, జీపీ కార్యదర్శి ,రుద్రూర్

అవగాహన కల్పిస్తున్నాం

కుక్కలకు టీకాలు వేస్తున్నాం. ఇక్కడి వచ్చే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కుక్కలు దాడి చేయకుండా ఎలా వ్యవహరించాలో వివరిస్తున్నాం. – సంతోష్ రెడ్డి, వెటర్నరీ వైద్యాధికారి

ప్రమాదకరంగా మూలమలుపులు



వేల్పూర్ మండలం అమీనాపూర్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

- వేల్పూర్ మండలంలో సూచిక బోర్డులు కరువు
- అధికారులు పట్టించుకోవాలని వాహనదారుల వినతి



సాహెబ్‌పేట్ నుంచి వెళ్లే దారిలో ..

వేల్పూర్: వేల్పూర్ నుంచి ఆర్మూర్ వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై అమీనాపూర్ శివారులో, సాహెబ్‌పేట్ నుంచి వేల్పూర్ వెళ్లే రహదారిలో ఉన్న ప్రమాదకర మూల మలుపులతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. వేల్పూర్ నుంచి ఆర్మూర్‌కు వేల్పూర్, భీమ్‌గల్ మండలాల ప్రయాణికుల వాహనాల రద్దీ ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో మూల మలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డులు లేక రాత్రి వేళ కొత్తగా ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. గతంలో ఈ మలుపు వద్ద ఎదురెదురుగా వాహనాలు ఢీకొని చాలా ప్రమాదాలు జరిగాయి. సాహెబ్‌పేట్ నుంచి వేల్పూర్‌కు వెళ్లే దారిలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వద్ద మూల మలుపు ఉంది. ఇక్కడ కూడా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే అవకాశం లేదు. నిత్యం ప్రయాణించే వారికి మూల మలుపు గుర్తుంటుంది. కొత్తగా వచ్చే వారికి మూల మలుపు తెలియదు. వర్షాకాలం కావడం వల్ల రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి మూల మలుపు తెలియకుండా ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి
- అభ్యర్థుల ఎంపికపై నాయకులకు సూచనలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఆదివారం సాలూరలో పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ సర్పంచ్‌ల పదవులకు పోటీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థుల ఎంపికపై పలు సూచనలు చేశారు. సమన్వయం, సమిష్టిగా ఎన్నికల్లో ముందుకెళ్లాలని తెలిపారు.పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగెట్ గంగాశంకర్, మండల పార్టీ అధ్యక్షుడు మందర్నా రవి, సాలూర సొసైటీచైర్మన్ అల్లె జనార్దన్,మాజీ చైర్మన్ శివకాంత్ పటేల్, మాజీ ఎంపీటీసీ గాండ్ల పెద్ద రాజేశ్వర్, నాయకులు ఇల్తెపు శంకర్, ముట్టెన్ గంగారాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ దైవ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. నిత్యం భగవంతుడి నామస్మరణ చేయడంతో జీవితం ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎడపల్లిలోని షిర్డిసాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు.ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వర శర్మ 20 ఏళ్లుగా మండల కేంద్రంలో షిర్డి సాయిబాబా ఆలయ నిర్మాణం మొదలు అభివృద్ధికి విశేష కృషి చేశారని అభినందించారు.ఈఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా పలువురు మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, నిరుపేదలకు నిత్యావసర సరుకుల కిట్లు వితరణ చేయగా, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శంకర్ నాయుడు, ఎల్లయ్య యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగం, ఏఎంసీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యమనేత అద్దంకి ఉషాన్ కన్నుమూత



ఉషాన్ (ఫైల్)

బోధన్: బోధన్ పట్టణంలోని ఆజాంగంజ్ ప్రాంతానికి చెందిన ఆర్టీసీ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఆల్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు అద్దంకి ఉషాన్ (69) ఆదివారం కన్నుమూశారు. వారం రోజుల క్రితం ఆయన ఆరోగ్య సమస్యలతో అస్వస్థతకు గురికాగా కుటుంబీకులు మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన సతీమణి కొన్నేళ్ల క్రితమే మృతి చెందాగా, కూతురు ప్రియాంక, కొడుకు ప్రదీప్ ఉన్నారు.ప్రస్తుతం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శిగా, ఈపీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉషాన్ మృతిపై తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా, డివిజన్ ప్రతినిధులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు పట్టణ కేంద్రంలోని ఆయన స్వగృహంలో అంత్యక్రియలు జరుగనున్నాయి.

మద్దతు ధరను రైతులు వినియోగించుకోవాలి



రెంజల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి అశోక్ కుమార్



జానకంపేట సొసైటీ ఆవరణలో..

రెంజల్/బోధన్ : ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను రైతులు వినియోగించుకోవాలని రెంజల్ విండో ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం రెంజల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విండో కార్యదర్శి ఇంద్రసేన్‌రెడ్డితో పాటు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎడపల్లి మండలం జానకంపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సీఈవో గంగారెడ్డి, సంఘ ప్రతినిధులు, సభ్యులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సొసైటీ సీఈవో మాట్లాడారు.ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2389, సాధారణరకం ధాన్యానికి రూ.2369 ప్రభుత్వ మద్దతు ధర ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్, సిబ్బంది ప్రవీణ్, నర్సయ్య, పాలక వర్గ సభ్యులు, రైతులు ఉన్నారు.

సమాజ సేవకే ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుకుమార్

నవీపేట: సమాజ సేవకే ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యతనిస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత ప్రముఖ్, ప్రధానవక్త కల్వకుర్తి ప్రభుకుమార్ పేర్కొన్నారు. నవీపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుకుమార్ మాట్లాడారు. 1925లో కేశవ్ బలిరాం హెడ్గేవార్ సేవా దృక్పథంతో ఎస్ఎస్ఎస్‌ను ప్రారంభించారని పేర్కొన్నారు. దేశ విదేశాల్లో సేవా కార్యకలాపాలను విస్తరించి మంచి పేరుగడించిందన్నారు. క్రమశిక్షణ, సేవా భావాన్ని విస్తరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు యువత ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. దేశ భక్తిని పెంపొందించడంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలకపాత్ర వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ రిటైర్డు జేడీ మఠంకర్ సుధాకర్‌రావ్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరిలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ పర్యావరణ సంయోజక్ రామ్ నరేష్ మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, స్వయం సేవకులు ఉన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆర్‌ఎస్‌ఎస్ మండల బాధ్యులు పాండురంగారావు ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా ధర్మోరా, గొట్టిముక్కల, బొంకన్‌పల్లి, మాందాపూర్, మాక్లూర్ గ్రామాలలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. యువకులు దేశ సేవకు ముందుకు రావాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యకార్యకర్తలు దాసరి గంగాధర్, బొడ్డు రాజేంద్రప్రసాద్, ఓంప్రకాష్, అధిక సంఖ్యలు హిందూ యువకులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఆవరణలో 'స్వచ్ఛ ఆర్మూర్'



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట – స్వచ్ఛ ఆర్మూర్ కోసం శుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఫైర్ స్టేషన్ ఆవరణంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ఫైర్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



ఆచన్‌పల్లిలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి

బోధన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలుపించుకొని సత్తాచాటాలని బీఆర్ఎస్ బోధన్ నియోజక వర్గ ముఖ్య నాయకుడు డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి అన్నారు.ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆచన్‌పల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు సంజీవ్ స్వగృహంలో మండల స్థాయి పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు పార్టీ అభ్యర్థులను గెలిచే వారిని ఎంపిక చేసుకుని విజయం సాధించేందుకు సమిష్టిగా పని చేయాలని నాయకులకు సూచించారు. మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందనే విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. బోధన్ ,సాలూర మండలాల పార్టీ అధ్యక్షులు సంజీవ్, గోగినేని సర్సయ్య, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కోట గంగారెడ్డి, నాయకులు రవికిరణ్, ఖలీల్ పటేల్ వంద మందికి పైగా గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



బోధన్‌లో లింబూరి లక్ష్మణ్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న వడ్డి మోహన్‌రెడ్డి

బోధన్: సాలూర గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు లింబూరి లక్ష్మణ్ బీజేపీ లో చేరారు. పట్టణ కేంద్రంలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి కార్యాలయంలో ఆదివారం లింబూరి లక్ష్మణ్‌కు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సాలూర మండల అధ్యక్షుడు రావుభా గంగాధర్, మాజీ అధ్యక్షుడు గోనే ప్రవీణ్, నాయకులు దిలీప్,ఊర్వంత్‌రావు పటేల్, ముట్టెన్ ప్రకాశ్, మాధవరావు పటేల్, భాస్కర్ ,కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రూర్: మండలంలోని రాయకూర్ క్యాంపులో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆదివారం బీజేపీలో చేరినట్టు పార్టీ జిల్లా ఓబీసీ కార్యదర్శి సుధాకర్ గౌడ్ తెలిపారు. రాయకూర్ గ్రామానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ బాన్సువాడ నియోజక వర్గ ఇన్‌చార్జి యెండల లక్ష్మీ నారాయణ వచ్చిన సందర్భంగా బీజేపీలో చేరినట్టు వెల్లడించారు.

పోచారంలో ఘనంగా ఊరపండుగ



బోధన్: ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో ఊరపండుగ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కాగా ఆదివారం ఘనంగా ముగిశాయి. గ్రామ సుభిక్షం కోసం ప్రతి నాలుగేళ్ల కొకసారి ఊరపండుగ ఉత్సవాలను జరుపుకుంటామని గ్రామ పెద్దలు తెలిపారు. ఆఖరి రోజు గ్రామదేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.వీడీసీ అధ్యక్షుడు గంగారాం, ప్రతినిధులు లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ కోల ఇంద్రకరణ్, నీరడి రవికుమార్, ముత్తన్న, పవన్‌కుమార్, రాజ్ కుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీని సందర్శించిన టీఎస్‌ఎండీసీ చైర్మన్



ఎస్సారెస్పీ డ్యాం పై ఈరవత్రి అనిల్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను ఆదివారం టీఎస్‌ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ సందర్శించారు. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు వస్తున్నందున ప్రాజెక్ట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రాజెక్ట్ దిగువన గల జల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో బతుకమ్మ సంబురాలు



ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మలతో మహిళలు

ఆర్మూర్: ఇజ్రాయిల్ దేశంలో ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు బాణాల గంగాధర్, ఉపాధ్యక్షుడు మంగళారం రాజు, ప్రధాన కార్యదర్శి చిన్న, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా తెలంగాణ మహిళలు బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో అసోసియేషన్ చైర్మన్ పస్క సుధాకర్, మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ , శివ గౌడ్, వూషన్న, మరంపల్లి బన్నీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.



: 9010585333
: 9849180004
: 9966956559
: 7993150102
: 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899